# షరా

ఆ మనిషిని ఎక్కడో చూశాననిపించింది. కాని ఎంత ఆలోచించినా జ్ఞాపకం రాలేదు. కృష్ణలంకలో నాకు ఎవ్వరితోనూ పరిచయం లేదు. నేను ఎన్నడూ ఆ లంకలో అడుగు పెట్టి కూడా ఎరగను.

మా ఊరు బెజవాడ దగ్గరదే అయినా నేను ఏడెనిమిది సంవత్సరాలనుంచీ మద్రాసులోనే వుంటున్నాను. ఈ ప్రాంతాలకు రాలేదు. ఇటీవల వొచ్చిన గాలివానకు పంటలన్నీ పాడైనయ్యని తెలుసుకొని పొలాలు చూచుకు వెళ్ళదామని వొచ్చాను. గాలివానవల్ల నిజంగా అపారమైన నష్టం కలిగింది. నేను ఎరిగింతర్వాత ఇంత నష్టం ఎప్పుడూ జరగలేదు. కవులువాళ్లు తమ గింజలు కూడా రావని గోలపెడుతున్నారు. నేను ఏమి చెయ్యగలను! మళ్ళీ మద్రాసు వెళ్దామని బయలుదేరి, ఎలాగూ వచ్చాం గదా అని, బెజవాడలో వున్న నా మిత్రుణ్ణి వొకణ్ణి చూచిపోదామని బెజవాడలో దిగాను. అతను గాలివానకు నష్టపడ్డవారికి సహాయం చేసే

పరియత్నంలో వుండి "రేపు వెళ్లొచ్చులే" అంటే - ఆనాటికి ఆగిపోయాను.

ఆ సాయంత్రం బెజవాడ లంకలో నష్టపడ్డ బీదజనానికి వాసాలూ, తాటాకులూ పంచిపెడుతూ నన్నుకూడా రమ్మంటే నేనూ వెళ్లాను. శరణార్థుల్లో కనుపించాడు ఆ మనిషి. ఆ మనిషి నన్ను చూచి కొంచెం బెరుకుపడ్డట్టుకూడా అనిపించింది నాకు. నిజంగా ఆ మనిషిని నేను ఎక్కడో చూశాను. అందులో సందేహం లేదు. కాని ఏ సందర్భంలో చూశానో ఎంత ఆలోచించినా నాకు జ్ఞాపకం రాలేదు.

మేము పని పూర్తిచేసుకొని యింటికి వస్తుంటే ఒక రైతు మా వెంట వొచ్చాడు. అతనివల్ల ఆ మనిషి కోటిరెడ్డి మామ అని తెలుసుకున్నప్పుడు నాకు ఆశ్చర్యం వేసింది. కోటిరెడ్డిని నేను ఎరుగుదును. అతనూ మద్రాసులోనే ఉంటున్నాడు. అతని మామనుకూడా నేను ఎరుగుదును. ఒకసారి అతని అత్తవారి ఇంటిదగ్గర ఉండగా అతన్ని చూద్దామని వెళ్లాను. అప్పుడే ఈయన్ని చూశాను. కాని గుర్తుపట్టక పోవటం నా తప్పు కాదు. మనిషి చాలా మారిపోయాడు.

♦ ♦ ♦

నేను ఎట్లాగూ మద్రాసు వెళుతున్నాను గనక అల్లుడికేమైనా కబుర్లు చెబుతాడేమోనని మర్నాడు ప్రొద్దున్నే లేచి కోటిరెడ్డి మామను చూద్దామని లంకకి ప్రయాణంకట్టాను, ఆ లకంలో వుంటున్నదంతా అలకాజనం. నాకు తెలిసినంత వరకు కోటిరెడ్డి మామ కొద్దిగా వున్నవాడే. కాని ఈ మధ్య

ఏం జరిగిందో నాకు తెలియదు. స్వగ్రామంలో వున్న ఇల్లూ వాకిలి వొదులుకొని ఇక్కడ ఎందుకు కాపరం పెట్టాడోకూడా నాకు తెలియదు. కోటిరెడ్డి కూడా ఈ విషయం నాతో ఎన్నడూ ప్రస్తావించలేదు. అక్కడ వున్నవన్నీ చిన్న చిన్న పూరిగుడిసెలే. ఆ గుడిసెల్లో వొక గుడిసెలో రం వుంటున్నాడు కోటిరెడ్డి మామ. నేను వెళ్ళేటప్పటికి ఆ స్థలంలోనే వున్న మరికొన్ని గుడిసెల్ని బాగుచేయిస్తు న్నాడు. నన్ను చూచి కొంచెం తబ్బిబ్బుపడ్డాడు. ఇంటిలోకి వెళ్ళి నేను కూర్చోగలందులకు ఒక కుక్కిమంచం తెచ్చాడు. అతన్ని చూస్తే నాకు ఆశ్చర్యంవేసింది. ఇంత హీనస్థితికి ఎందుకు వొచ్చాడా అని ఆలోచించ బుద్ధి ఐంది. మాటల్లోకి దింపాను. అతను ఆకును అందకుండా పోకను పొందకుండా జవాబులు చెప్పాడు. తన అల్లుడి సంగతి అడిగాడు. బాగానే వున్నాడని చెప్పాను. నేను అదీ, ఇదీ అడిగాను గాని సరైన జవాబులు చెప్పలేదు. చివరికి; "నేను దాసు వెళ్తున్నాను మీ అల్లుడికి ఏమైనా కబుర్లు చెపుతారా?" అని అడిగాను.

"ఇట్లా వుంటున్నామని చెప్పండి" అన్నాడు. నేను ఆయనదగ్గర సెలవుతీసుకొని మిత్రుని ఇంటికి బయలుదేరాను. దారిలో ముందురోజు కలిసినరైతు కలిశాడు. అతన్ని అడిగాను, కోటిరెడ్డి మామనుగురించి.

"ఆయన ఆస్థి ఎందుకు పోయింది?" అని అడిగాడు.

"ఆస్థిపోవటం ఏమిటండోయ్!" అన్నాడు ఆ రైతు.

"ఆస్థి పోకపోతే ఈ గుడిసెలో వుండవలసిన అవుసరం ఏ మొచ్చింది?" అన్నాను.

"అదా అండి...అట్లా అడగండి" అన్నాడు రైతు. అని ఈ విధంగా చెప్పాడు; "ఏమండోయ్ నాదీ ఆయన్దీ వొక ఊరే... తెలుసా అండి....నాకాయన సంగతి బాగా తెలుసు ...ఆస్థిపోయి రాలేదు..."

"మరెందుకొచ్చాడు?"

"సంపాదించటానికి వొచ్చాడు. అక్కడ ఇల్లూ, పొలం అమ్ముకొని వడ్డీకిచ్చి ఈ లంకలో స్థలాలు చౌగ్గావున్నాయనీ, తొందరలో ధరలు పెరుగుతాయనీ తెలుసుకొని, ఇక్కడ స్థలం కొన్నాడు... రేపీ స్థలం అమ్ముకొడు...ఇంకొకచోట కొంటాడు...ఆయన కేమండీ...షాకారూ.... ఈ స్థలం కొన్నాడా....కొని వూరికేవుంటే యేమొస్తుందని నాలుగు గుడిసెలు వేయించి అద్దెకిస్తున్నాడు...కాని గాలివాన వొచ్చింరోజే గమ్మత్తంటే గమ్మత్తు..." అని నవ్వటం మొదలు పెట్టాడు.

కారణం తెలియకపోయినా, అతను నవ్వుతుంటే నాకూ నవ్వు వొచ్చింది. "ఏం జరిగిందేమిటి?" అని అడిగాను.

"అంతకు ముందు మూడురోజులనుంచీ గాలివాన కొడుతూ వుంది. ఆ రోజు మరీ ఎక్కువైంది. లంకలో వుంటానికి వీల్లేక అంతా వూళ్లోకి వెళ్లారు తలదాచుకోటానికి. ఈయన్ని రమ్మంటే రాడే 'ఈ ఇళ్లు నన్ను కాపాడినై... కష్టకాలంలో వాటిని విడిచిపెట్టి రాను' అంటూ కూర్చున్నాడు... అయన భార్య కూడా ఆయనకు తగ్గదే దొరికింది. 'వొచ్చిన గాలివాన పోక వుంటుందా... వెళ్ళటం రావటం...

ఇదంతా ఎందుకు?' అంటూ కూర్చుంది.... వొచ్చిన గాలీవాన ఎట్లాగూ పోతుందట!'' మళ్ళీ నవ్వటం మొదలుపెట్టాను.

"చివరికి ఏమైంది?'' అని అడిగాను.

"ఏమవుతుంది? వాళ్ళు రానంటే మాత్రం మేము ఊరుకుంటామా! వాళ్ళసంగతి దేవుడెరుగు. వాళ్ళకొక చంటిబిడ్డవుంది. ఆ చంటిబిడ్డ జోరున తడుస్తుంటే ఎట్లా చూస్తూ ఊరుకోవటం.... బలవంతంగా తీసుకువెళ్ళాం... అదుగో చూడండి ఆ కట్టెల అడితీ.... అది దాటి రానంటాడే ...తన ఇళ్ళకు వీలైనంత దగ్గర్లో వుండాలని ఆశ! ఆ రాత్రి ఆ కట్టెల అడితీలో పెట్టాం...మమ్మల్ని నానా మాటలూ అంటూ కూర్చున్నాడు... ఆయన అల్లుడి తరపు బంధువులు వూళ్ళో వున్నారు. వాళ్ళు వొచ్చి తమ యింటికి రమ్మని పిలిచారు. ఊహు, ఎంత చెప్పినా వినడు....పైగా 'మీరు ఆనాడు అట్లాచేశారు. ఈనాడు యిట్లాచేశారు. నా సంగతి మీకు పట్టిందా, ఈ కష్టంలో నన్నుచూసి నవ్వాలనిఒచ్చారు' అని మండిపడిపంపించాడు. ఎట్లాగో తెల్లవారేదాకా ప్రాణాలు బిగబట్టుకు కూర్చుని తెల్లవారి మళ్ళీ భార్యాసమేతంగా లంక ప్రవేశించాడు. అప్పటికి గాలివాన కొంచం తగ్గిందిగానీ యింకా యెవ్వరూ బయటకు రావటంలేదు. పాపం పడి పోయిన యిళ్ళని చూడలేకపోయాడు. వాటిని మళ్ళీ మామూలు ఆకారంలో చూస్తేగాని వుండలేకపోయాడు. భార్యనీ, చంటిపిల్లనీ పడని మొండిగోడలకు నాలుగు ఆకులు కప్పి, దాని క్రిందపెట్టి ఇళ్లు నిలబెట్టటానికి పూను

కున్నాడు....." ఈ విధంగా ఆ రైతు చెప్పి చెప్పి, "పాపం అతనికి ఇప్పుడు వొక్కటే దిగులు" అని పెదవి విరిచాడు.

"ఏమిటది?" అని అడిగాను.

"ఏముంది, పాపం! మొదట్లో తాను ఉంటానికి వొక గుడిసె వేయించాడు. అద్దెలవాళ్ళ పోరుపడలేక ఆ గుడిసెలో సగం అయిదు రూపాయలకు అద్దెకిచ్చి మిగిలిన సగంలో తాను వుండేవాడు. అప్పటికీ అద్దెలవాళ్ళ పోరుతగ్గలేదు. అందుకని ఆ సగం కూడా అద్దెకిచ్చి పంచలో వుండేవాడు. ఆ పంచకూడా అద్దెకివాల్సి వొచ్చింది. అందుకని మరొక గుడిసె వెయాల్సి వొచ్చింది. కాని ఆ గుడిసెపనీ ఇంతే అయింది. ఎన్ని గుడిసెలు వేయించినా, తాను కొంతస్థలం ఆక్రమించుకోవాల్సి రావటం, అంతమేరా అద్దె డబ్బులు దండగ అవటం జరుగుతూ వుంది... ఈ సమస్య ఎట్లా తీరుతుందా అని అతను రాత్రింబగళ్ళూ దిగులు పడుతూ ఉంటాడు" అని చెప్పి పెద్ద పెట్టున నవ్వాడు.

నాకూ నవ్వు వొచ్చింది. ఆ రైతు చెపుతున్న పద్ధతి నాకు నవ్వు తెప్పించింది. కాని లోపల కోటిరెడ్డి మామ ఎందుకు మారాడా అని ఆందోళన కలగకపోలేదు. మొదట్లో నేను చూచినప్పుడు అతను చాలా మర్యాదస్తుడుగా కనిపించాడు. ఊళ్లో గౌరవంగా వుండేవాడు. తాను తినేవాడు, ఇతరులకు పెట్టేవాడు. మర్యాదకు ప్రాకులాడే మనిషనే అనుకున్నాను నేను. ఇంతగా ఎందుకు మారాడో!

*　　*　　*

ఆ రాత్రి మెయిల్లోనే నేను మద్రాసు జేరుకున్నాను. నా సొంతపనులు చూచుకుంటూ నాలుగు రోజులు కోటిరెడ్డిని కలవలేకపోయాను. అయిదోరోజు సాయంకాలం అతని ఇంటికి వెళ్లాను. అతను ఇంట్లోనే వున్నాడు. ఏదో రాసుకుంటూ వున్నాడు కాసేపు అదీ ఇదీ మాట్లాడి అతని మామను చూశాననీ, గాలి వానకు చాలా నష్టపడ్డాడనీ, ప్రస్తుతం బాగానే వున్నాడనీ మాత్రంచెప్పాను. అతనుకాసేపు ఏమీమాట్లాడ లేదు. నెమ్మదిగా డ్రాయరు తీసి చదవమని వొక కార్డు ఇచ్చాడు. అది అతని మామ కూతురికి వ్రాసిన ఉత్తరం. అందులో ఇల్లా వుంది.

"కొడ్డా,

నీవు వ్రాసిన వుత్తరం అందినది. గాలివానవల్ల నష్ట పడ్డా, భగవంతుని కృపవల్ల అట్టే నష్టం లేకుండానే తేరు కున్నాము. గాలివాన తగ్గిన మర్నాడే, ఎవ్వరూ ధైర్యం చెయ్యకపోయినా, మీ అమ్మా నేనూలంకప్రవేశించిఇళ్లునిల బెట్టాము. మళ్ళీ వొకరొకరే అద్దెలవాళ్ళు ఇప్పుడిప్పుడే వొస్తున్నారు. ఇళ్లు మళ్ళీ వేయించినందుకుగాను నెలకి యిది వరకంటే వొక రూపాయి ఎక్కువ ఇవ్వాలని మీ అమ్మ అడుగుతూ వుంది. నువ్వు మాత్రం డబ్బు దగ్గర జాగ్రత్తగా వుండు. మీ ఆయనపుస్తకాలకనీ. వాటికనీఅనవసరంగాడబ్బు తగలవేస్తూ వుంటాడు. నువ్వు గట్టి పట్టుపట్టి డబ్బు ఖర్చు కాకుండా చూడు. ఆయనకు లేక పోయినా, నువ్వయినా నీ పిల్లల సంగతి చూచుకోవాలిగదా!"

ఈ విధంగా వ్రాసి షరాలో "చంటిబిడ్డ, జలుబుచేసి మరణించిం" దని తెలియజేశాడు. నేను ఉత్తరం చదివి కోటిరెడ్డి వంకకు చూశాను.

"చూశావా, చంటిబిడ్డ మరణించటం ఆయన కంత స్వల్ప విషయంగా కనుపిస్తూ వుంది. ఆ గాలివానలో ఇటూ అటూ తిప్పి ఉంటారు, డాక్టరుకికూడా చూపి ఉండరు. తమ ఇళ్ళేమో, వడ్డీ డబ్బులేమో, అద్దెలేమో తప్ప మరింకొకటి వాళ్ళకు పట్టదాయె. పైగా చెప్పినవాళ్ళు పిచ్చివాళ్ళ కింద లెక్క. మొదటినుంచీ ఇలా ఉండేవాడు కాదు. కాని పొలం అమ్మి వడ్డీకిచ్చాడూ, అప్పటినుంచీ ఇట్లా తయారయ్యాడు. క్రమక్రమేణా మరీ అన్యాయం అయిపోతున్నాడు" అన్నాడు కోటిరెడ్డి.